బుధవారం 10-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 390, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# జవాన్ల త్యాగానికి ప్రతీకారం తీర్చుకుంటాం

## భారత రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్

ముందడుగు జమ్ముకశ్మీర్: కథువా ఉగ్రదాడి ఘటనపై ప్రతీకారం తప్పక తీర్చుకుంటామని భారత రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరామనె స్పష్టం చేశారు. దాడి వెనుక ఉన్న దుష్ట శక్తులను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. ఉగ్రదాడిలో అమరులైన సైనిక కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'కథువాలోని బద్నోటాలో ఆర్మీ కాన్వాయ్‌పై జరిగిన ఉగ్రదాడిలో ఐదుగురు జవాన్లను కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. సైనికుల నిస్వార్థ సేవలను దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది. వారి త్యాగానికి ప్రతీకారం తీర్చుకుంటాం. దాడి వెనుక ఉన్న దుష్ట శక్తులను భారత్ మట్టుబెడుతుంది' అని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భారత సైనికులు జరిపిన ఎన్‌కౌంటర్లపై ఉగ్రవాదులు



ప్రతీకార దాడికి పూనుకున్నారు. సోమవారం భారత ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఐదుగురు జవాన్లు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. కథువా జిల్లాలోని మాచేడి ప్రాంతంలో ఉగ్రవాదులు కొండపై నుంచి గ్రనేడ్లు, ఇతర మారణాయుధాలతో ఈ దాడి చేశారు. వెంటనే తేరుకున్న సైనికులు ఎదురుకాల్పులు జరుపగా, ఉగ్రవాదులు పారిపోయారు. వారి కోసం గాలింపు జరుగుతున్నది. మరోవైపు రాజౌరీ వద్ద మార్ఝుకోట్ సైనిక శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్‌కు గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన ఆర్మీ ఎదురుకాల్పులకు దిగడంతో ఉగ్రవాదులు పరారయ్యారు.



## మహాత్మాగాంధీ మాటలు

# పాటించాలి

- విద్యార్థులు సమాజ సేవ చేయాలి
- భువనేశ్వర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ముందడుగు భువనేశ్వర్: శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, సైన్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే స్థాయిలో దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 13వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కొత్త సాంకేతికత వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అదే సమయంలో మానవాళికి అది సరికొత్త సవాళ్లను విసురుతుంది. ఉదాహరణకు క్రిస్పార్-క్యాస్9 సాంకేతికత వల్ల మానవుల జన్యువులల్లో మార్పులు చేయడం చాలా సులభమైంది. ఎన్నో రకాల వ్యాధులను నయం చేసేందుకు మిగతా 2లో




## విరాట్ కోహ్లీ పబ్‌పై కేసు నమోదు

వివరాలు 2లో



## చట్నీలో ఎలుక.. వడలో ఈగ

వివరాలు 3లో



## ప్రమాదకరమైన మొక్కల్లో కోనోకార్పస్

వివరాలు 3లో



## ఒంటరి పెండ్లి ఇదో కొత్త ట్రెండ్

వివరాలు 4లో

## పరీక్షలు రద్దు చేయాలని

# ప్రతిపక్షం కుట్ర

- నిరుద్యోగుల కోసమే వాయిదా వేయడం లేదు
- విద్యార్థుల చావులతో బిఆర్ఎస్ రాజకీయం చేస్తుంది
- మహబూబ్‌నగర్ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి

ముందడుగు తెలంగాణ: పాలమూరు జిల్లా మొదటి నుంచి నిర్లక్ష్యానికి గురైందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తోన్న మిగతా 2లో



# నిర్వాహకుల నిర్లక్ష్యమే 121 మంది బలి

- వాస్తవాలను దాచిపెట్టి అనుమతి
- పోలీసులు, యంత్రాంగం సీరియస్‌గా తీసుకోలేదు
- హాథ్రస్ తొక్కిసలాటపై సిట్ నివేదిక

ముందడుగు ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్ హాథ్రస్‌లో జరిగిన తొక్కిసలాటపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదికను మంగళవారం యూపీ ప్రభుత్వానికి సమర్పించింది. తొక్కిసలాటకు నిర్వాహకులదే బాధ్యత అని, స్థానిక యంత్రాంగం కూడా ఉదాసీనంగా వ్యవహరించిందని మిగతా 2లో



ముందడుగు
బుధవారం, 10-7-2024, హైదరాబాద్

# మహాత్మాగాంధీ మాటలు పాటించాలి

మొదటిపేజీ తరువాయి

సహకరించింది. అయితే, ఈ సాంకేతికత సామాజికంగా ఎన్నో రకాల సమస్యలు సృష్టించింది. అంతేకాకుండా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందిన కృత్రిమమేధ వల్ల డీప్ ఫేక్ సమస్య ఎదురైంది. సాంకేతికతను సక్రమ మార్గంలో ఉపయోగించకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించలేం" అని ద్రౌపది ముర్ము అన్నారు.

సైన్స్ హేతుబద్ధతకు సంప్రదాయ విలువలను జోడిస్తూ ఎన్ఐఎస్ఈఆర్ ముందుకు వెళ్తుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. "జాతిపిత మహాత్మాగాంధీ ఏడు సామాజిక రుగ్మతలు ఉంటాయని విశ్వసించేవారు. అందులో 'దయలేని సైన్స్' కూడా ఒకటి. జాలి, దయ, మానవత్వం గురించి ఆలోచించకుండా సైన్స్‌ని ప్రచారం చేయడం మహా పాపం. ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు. శాస్త్రపరిజ్ఞానంపై పరిశోధనలు చేసేందుకు చాలా ఓర్పు సహనం అవసరమని, ఫలితం రాబట్టేందుకు చాలా కాలం వేచి చూడాల్సి రావొచ్చని ముర్ము అన్నారు. అందువల్ల ఎప్పుడూ నిరుత్సాహ పడకుండా లక్ష్యం దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నిర్వాహకుల నిర్లక్ష్యమే 121 మంది బలి

మొదటిపేజీ తరువాయి

సిట్ పేర్కొంది. తొక్కిసలాట ఘటనపై ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా.. ప్రమాదానికి ఈవెంట్ ఆర్గనైజర్ల నిర్వహణ వైఫల్యమే కారణమని ప్రాథమికంగా తెలిసింది. వాస్తవాలను దాచిపెట్టి నిర్వాహకులు సత్సంగ్ కార్యక్రమానికి అనుమతులు తీసుకున్నారు. షరతులు పాటించలేదు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలను ఆహ్వానించి.. వారికి కనీస ఏర్పాట్లు చేయలేదు. ఎలాంటి పోలీసు వెరిఫికేషన్ లేకుండానే వాలంటీర్లను నియమించుకున్నారు. భద్రతాపరమైన ఏర్పాట్లు కూడా లేవు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు వారు బయటకు వెళ్లేందుకు బారికేడ్లు కూడా పెట్టలేదు. ప్రమాదం జరగ్గానే నిర్వాహకుల కమిటీలోని సభ్యులు అక్కడినుంచి పారిపోయారు" అని సిట్ తన నివేదికలో వెల్లడించింది. అటు స్థానిక పోలీసులు, యంత్రాంగం కూడా ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోలేదని సిట్ తెలిపింది. సత్సంగ్ జరిగే వేదిక ప్రాంగణాన్ని తనిఖీ చేయకుండా.. కనీసం సీనియర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆ కార్యక్రమానికి అనుమతులు ఇచ్చారని సిట్ తెలిపింది. సర్కిల్ ఆఫీసర్, రెవెన్యూ అధికారి, ఇన్‌స్పెక్టర్, ఔట్‌పోస్ట్ ఇన్‌ఛార్జ్ అందరూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపింది. వీరిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సులు చేసింది. అయితే, ఈ ఘటనలో కుట్ర కోణాన్ని కూడా తాము కొట్టిపారేయలేమని, దానిపై సమగ్ర దర్యాప్తు అవసరమని సిట్ అభిప్రాయపడింది. ఈ నివేదిక ఆధారంగా యూపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్థానిక సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, సర్కిల్ అధికారితో పాటు మరో నలుగురిని మంగళవారం సస్పెండ్ చేసింది. 80 వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయితే 2.5 లక్షలకు పైగా ప్రజలు వచ్చినట్లు తేలింది. భోలే బాబా వెళ్తుండగా ఆయన దర్శనం కోసం ప్రజలు ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగి 121 మంది మృతి చెందారు. ఈ ఘటనపై ఇప్పటివరకు 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

# పరీక్షలు రద్దు చేయాలని ప్రతిపక్షం కుట్ర

మొదటిపేజీ తరువాయి



ఆయన జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి, పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సూచనలను ఈ ప్రభుత్వం తప్పక పాటిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలకు న్యాయం చేస్తామని, త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. 11వేలకు పైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. ఎన్నో ఏళ్లుగా జరగని డీఎస్సీని అడ్డుకోవాలని కొందరు చూస్తున్నారు. భారాస హయాంలో ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## నిరుద్యోగుల కోసమే వాయిదా వేయడం లేదు

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉంది. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలిస్తే మళ్లీ కోర్టుకు వెళ్తారు. నోటిఫికేషన్‌లో లేకుండా 1:100 నిష్పత్తిలో ఎలా పిలుస్తారని కోర్టు మళ్లీ రద్దు చేస్తుంది. పదే పదే పరీక్షలు రద్దు చేయాలని ప్రతిపక్షం కుట్ర చేస్తోంది. పరీక్షలు వాయిదా వేయాలనే డిమాండ్ వెనుక కోచింగ్ సెంటర్ల కుట్ర కూడా ఉంది. నిరాహార దీక్షల్లో పేద విద్యార్థులు, పేద నేతలు మాత్రమే ఎందుకు కూర్చుంటున్నారు. దీక్షల్లో కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు కూర్చోవడం లేదు. వారిద్దరూ ఆర్ట్స్ కాలేజీ ముందు దీక్షకు కూర్చుంటే.. రక్షణ కల్పిస్తాం. పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి లాభమే తప్ప నష్టం ఉండదు. కేవలం నిరుద్యోగులకు న్యాయం చేసేందుకే పరీక్షలు వాయిదా వేయడం లేదు. విద్యార్థుల చావులతో భారాస రాజకీయం చేస్తుంది" అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

# ప్రోటోకాల్ పాటించలేదని అలిగిన మంత్రి

## ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ విజయలక్ష్మి



ముందడుగు హైదరాబాద్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం కోసం చేసిన ఏర్పాట్లలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయం బయటే కూర్చుండిపోయారు. కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌పై సీరియస్ అయ్యారు. వీవీపీలు వస్తున్న సమయంలో ఆలయం ఎదుట సరైన సెక్యూరిటీ లేదని మండిపడ్డారు.

కొలిచిన వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం గణపతి పూజతో కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి ఎదుర్కోళ్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. 11.34 నిమిషాలకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మహాశాంతి చండీ హోమం, సాయంత్రం ఆరు గంటలకు ఎల్లమ్మ అమ్మవారిని రథంపై పురవీధుల్లో ఊరేగిస్తారు.





# విరాట్ కోహ్లీ పబ్‌పై కేసు నమోదు

## నిబంధనలను విరుద్ధంగా తెరిచారని ఆరోపణ

ముందడుగు బెంగళూరు: ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీకి చెందిన పబ్‌పై తాజాగా బెంగుళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6వ తేదిన బెంగళూరులోని కబ్బన్ పార్క్ పోలీసులు రెస్టారెంట్లు, బార్లు, పబ్బులపై స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా రాత్రి వరకు తెరచి ఉన్న పబ్బులు, క్లబ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే బెంగళూరులోని కస్తూరాబా రోడ్డులో విరాట్ కోహ్లీకి చెందిన వన్8 కమ్యూన్ పబ్‌పై పోలీసులు రైడ్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్ణీత సమయానికి మించి పబ్ తెరిచినందుకు విరాట్ కోహ్లి పబ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా తెల్లవారుజామున 1.20 గంటల వరకు పబ్‌లను తెరిచారంటూ కస్తూరాబా రోడ్డులోని వన్ 8 కమ్యూన్, చర్చి స్ట్రీట్‌లోని ఎంపైర్ రెస్టారెంట్, బ్రిగేడ్ రోడ్డులోని పాంజియో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు పబ్ తెరిచి ఉన్నట్లు సమాచారం అందడంతో.. దీంతో పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, పబ్‌లు తెరిచి ఉన్నట్లు తెలిసింది. అందులో కస్టమర్లు కూడా ఉన్నారు. దీంతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణీత సమయానికి మించి పబ్ తెరిచారంటూ పోలీసులు పలు రెస్టారెంట్లు, పబ్‌లపై కేసు నమోదు చేశారు.

ముందడుగు
బుధవారం, 10-7-2024, హైదరాబాద్

# ప్రమాదకరమైన మొక్కల్లో కోనోకార్పస్

## ▪ఈ చెట్ల నుంచి వచ్చే గాలి చాలా ప్రమాదం
## ▪తెలంగాణలో దాదాపు 10 కోట్లకు పైగా నాటారు



ముందడుగు తెలంగాణ:
పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లే మూలం.. అందుకే ప్రభుత్వాలు కూడా చెట్లను పెంచాలనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. కానీ అన్ని రకాల చెట్లు మనకు మేలు చేస్తాయని అనుకోకూడదని, హాని చేకూర్చే చెట్లూ కూడా ఉన్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అటువంటి ప్రమాదకరమైన మొక్కల్లో కోనోకార్పస్ ఒకటి. మాంగ్రూవ్ మొకలుగా పిలిచే వీటిని అవగాహన లేక రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యలో విరివిగా నాటుతున్నారు. పచ్చదనం, అందం కోసం పెంచే ఈమొక్కల వల్ల ఆరోగ్యానికి ముప్ప వాటిల్లుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనోకార్పస్ వృక్షాల పుప్పడి అత్యంత ప్రమాదకరమైనదని, కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బంది పడతాడో ఈ చెట్ల నుంచి వచ్చే గాలిని పీల్చేవారు కూడా అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ మొక్కలను సమూలంగా నిర్మూలించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడలో ఇప్పటికే 5వేల వరకు మొక్కలను తొలగించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా అటవీశాఖ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. తెలంగాణలో దాదాపు 10 కోట్లకు పైగా కోనోకార్పస్ మొక్కలు ఉన్నట్టు అంచనా. ఏపీలో వాటిని నిర్మూలిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో కూడా వాటిని తొలగించాలని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని అటవీశాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఆ మొక్కలను కొత్తగా ఎక్కడా నాటడం లేదని చెప్పారు.



# ఆస్పత్రిలో కోతితో రీల్స్ చేసిన నర్సులు

## ఆరుగురు నర్సుల్ని సస్పెండ్ చేసిన అధికారులు

ముందడుగు ఉత్తరప్రదేశ్:
ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల నిర్వర్తించాల్సిన కొందరు నర్సులు కోతితో ఆడుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఆరుగురు నర్సుల్ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్‌లో ఓ ప్రభుత్వ మహిళా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. మహారాజా సుహెల్‌దేవ్ వైద్య కళాశాల ఆధ్వర్యంలోని ఆస్పత్రిలో కొందరు నర్సులు విధుల్లో ఉంటూ కోతిపిల్లతో ఆడుతున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో సీరియస్ అయ్యారు.

ఈ ఘటనపై ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎం.ఎం.త్రిపాఠి స్పందించారు. వీరిని ఆసుపత్రి గైనకాలజీ, ప్రసూతి విభాగంలో పనిచేస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. వైరలైన వీడియోలో ఉన్న ఆరుగురు నర్సుల్ని వైద్య కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ ఖత్రీ జులై 5న విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై విచారణ జరిపేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు త్రిపాఠి తెలిపారు. డ్యూటీ సమయంలో కోతితో రీల్స్ చేయడం, పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించేలా సామాజిక మాధ్యమాల్లో వైరలైన ఈ వీడియోతో వైద్యకళాశాల ప్రతిష్ట దెబ్బతింటుందని ప్రిన్సిపాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేశామని .. నివేదిక అందేవరకు ఈ ఆరుగురిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు.

# కాలేజీ ఫీజు డబ్బులతో బెట్టింగ్

## డబ్బులు పోవడంతో రైలు కిందపడి ఆత్మహత్య



ముందడుగు హైదరాబాద్:
ఆన్‌లైన్ బెట్టింగ్ భూతానికి మరో విద్యార్థి బలయ్యాడు. కాలేజీ ఫీజు డబ్బులను బెట్టింగ్‌లో పోగొట్టడంతో తల్లిదండ్రుల మందలించారని బీటెక్ విద్యార్థి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. నల్గొండలోని రవీంద్రనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులకు నితిన్(21), ఇద్దరు కుమార్తెలు సంతానం. ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న నితిన్.. స్నేహితులతో కలిసి గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. తల్లిదండ్రులిద్దరూ కూలి పనులు చేస్తూ పిల్లల్ని చదివిస్తున్నారు. నితిన్ చదివే కళాశాలలో ఫీజు చెల్లించాల్సి ఉండగా 10 రోజులు క్రితం తల్లిదండ్రులు రూ.1.03 లక్షలు నగదును కుమారుడుకి ఇచ్చారు. కళాశాలలో ఫీజు చెల్లించకుండా ఆ డబ్బులు బెట్టింగ్‌లో పోగొట్టాడు. ఈ విషయం తెలుసుకొని... కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదు, ఇలా ఎందుకు చేశావని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నితిన్.. మంగళవారం సాయంత్రం ఘట్‌కేసర్- చర్లపల్లి మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లిన జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీమార్చురీకి తరలించారు. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

# చట్నీలో ఎలుక.. వడలో ఈగ



ముందడుగు హైదరాబాద్:
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాల బాలుర హాస్టల్‌లోని మెస్‌లో పల్లి చట్నీ పాత్రలో ఎలుక చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. సోమవారం సాయంత్రం పల్లి చట్నీ పాత్రలో ఎలుక సంచరించడాన్ని అక్కడున్నవారు వీడియో తీశారు. మంగళవారం ఉదయమే ఈ వీడియోను పలు సోషల్‌మీడియా గ్రూపుల్లోకి షేర్ చేయగా వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ అధికారుల బృందంతోపాటు సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి హుటాహుటినా కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సుమారు 1400 మంది విద్యార్థులు వేర్వేరుగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, సీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారుల బృందం కళాశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెస్ కాంట్రాక్టర్‌ను తొలిగిస్తున్నట్టు అక్కడే ప్రకటించారు. తమకు అధ్వానమైన భోజనాన్ని అందిస్తున్నారంటూ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మెస్‌లు శుభ్రంగా లేనందున ఎలుకలు, బల్లులు, ఈగలు సంచరిస్తున్నాయని విద్యార్థులు గగ్గోలు పెట్టారు.

### మంత్రి రాజనరసింహ ఆరా

ఎలుక సంచారంపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆరా తీశా రు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామ ని చెప్పారు. పునరావృతం కాకుండా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముందడుగు
బుధవారం, 10-7-2024, హైదరాబాద్

# ఒంటరి పెండ్లి ఇదో కొత్త ట్రెండ్

## అమ్మాయిలు తమను తామే పెళ్లిచేసుకుంటారు



ముందడుగు డెస్క్:
టెక్నాలజీ పెరుగుతూ ఉంటే కొత్త, కొత్త పద్ధతులు అలవాటు అవుతున్నాయి. అందులో ఏది మంచినో, ఏది చెడునో తెలుసుకోలేని పరిస్థితి ఉంది. అలాంటిది ఇప్పుడు జపాన్‌లో 'ఒంటరి పెండ్లి' కొత్త ట్రెండ్‌గా మారింది. యువతులు తమను తామే మనువాడుతున్నారు. సంప్రదాయబద్ధమైన పెండ్లి తంతు వదిలిపెడుతున్నారు. పెళ్లి కొడుకు ఉండని ఈ కొత్త పెండ్లి ట్రెండ్‌లో వివాహ తంతును అన్ని రకాల హంగు, ఆర్భాటాలతో నిర్వహిస్తున్నారు. కొందరు యువతులు తమ జీవితంలో చాలా ముఖ్యమైన కార్యక్రమంగా దీనిని చేసుకుంటున్నారు. మరికొందరు సొగసైన తెల్లని గౌనును ధరిస్తున్నారు.

### నన్ను నేను సంతోషపరచుకుంటాను

ఈ ట్రెండ్‌కు ఆద్యురాలు అడల్ట్ వీడియో స్టార్ మన సకుర. ఆమె 2019 మార్చిలో తనను తానే పెళ్లి చేసుకుంది. "నేను నా సొంత జీవితాన్ని గౌరవిస్తాను. ఆరోగ్యంగా ఉన్నా, రోగగ్రస్థురాలినైనా, నన్ను నేను ఎల్లవేళలా ప్రేమించుకుంటాను, నన్ను నేను సంతోషపరచుకుంటాను" అని ప్రతిజ్ఞ చేసింది. హనవోకా అనే యువతి కూడా ఏకాకి పెళ్లి చేసుకుంది. "నన్ను నేను పెళ్లి చేసుకోవడమంటే, పురుషుడిని పెళ్లి చేసుకోవాలని కోరుకోవడం లేదని కాదు" అని ఆమె చెప్పింది. వివాహిత మహిళలు కూడా ఒంటరి పెళ్లిళ్లు చేసుకోవడం విశేషం. మరోవైపు సంప్రదాయబద్ధమైన పెళ్లిళ్లు తగ్గిపోయినట్లు జపాన్ ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అయితే సోలో వెడ్డింగ్స్ పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నదని తెలుస్తున్నది. ఏకాకి పెళ్లి చేసుకునేవారు సోలో హనీమూన్‌కు కూడా వెళ్తున్నారు!



# మాడల్ స్కూల్‌లో ఫుడ్ పాయిజన్

## 35 మంది కళాశాల విద్యార్థినులకు అస్వస్థత

ముందడుగు
మెదక్ జిల్లా రామాయంపేట బల్దియా పరిధి కోమటిపల్లిలోని తెలంగాణ మాడల్ స్కూల్ కళాశాలలో మంగళవారం ఉదయం అల్పాహారం తిని 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహ సిబ్బంది వారిని హు టాహుటిన రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. వై ద్యం అందించిన తర్వాత 32 మంది కోలుకోవడంతో హాస్టల్‌కు తరలించారు.

మరో ముగ్గురికి దవాఖానలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దవాఖానకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డీఈవో రాధాకిషన్, ఉప వైద్యాధికారి అనిల, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి, వైద్యురాలు హరిప్రియ, ప్రదీప్, సుకేషిని దవాఖానలో విద్యార్థినులను పరామర్శించారు.

# 5 ఫర్ 1 స్టాక్ విభజనను అంగీకరించిన ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ బోర్డు

ముందడుగు హైదరాబాద్:
హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాక్స్, కాటన్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు తన స్టాక్‌లను 5:1 నిష్పత్తిలో (ఐదింటికి ఒకటి) చొప్పున విభజించేందుకు అంగీకరించింది. క్యాపిటల్ మార్కెట్లో లిక్విడిటీని పెంచుకుని, షేర్ హోల్డర్ల పరిధిని విస్తరించేందుకు ఇలా చేస్తోంది.

FILATEX FASHIONS LTD

కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2024 జూన్ 7న సమావేశమైంది. ఆ రోజు ప్రస్తుతం రూ.5 ముఖవిలువగా ఉన్న ఒక్కో ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువ కలిగిన ఫుల్లీ పెయిడప్ 5 ఈక్విటీ షేర్లుగా విభజించేందుకు అనుమతించింది. అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం)లో షేర్ హోల్డర్లు ఈ సబ్-డివిజన్ తీర్మానాన్ని అంగీకరించిన తర్వాత, ఈక్విటీ షేర్ల సబ్ డివిజన్ కోసం రికార్డు తేదీని ప్రకటిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీ ఈజీఎంను 2024 జూలై 15 సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారు. దీన్ని వీడియో కాన్ఫరెన్సింగ్ లేదా ఇతర ఆడియో విజువల్ మార్గాలు (ఓఏవీఎం) ద్వారా నిర్వహిస్తారు.

# విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకోవాలి

## టాపర్ విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి



ముందడుగు ములుగు :
విద్యార్థిని, విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ఇంచర్లలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్ లో 2023-24 విద్యా సంవత్సరం 10వ తరగతి,ఇంటర్మీడియట్ లో టాపర్లుగా నిలిచిన 27 మంది పదవ తరగతి 16 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు పొరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలసి సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, సంబంధిత అధికారులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# అమర జవాన్ భార్యపై అసభ్యకర కామెంట్

## కఠిన చర్యలకు మహిళా కమిషన్ ఆదేశం

ముందడుగు జాతీయం:
సోషల్ మీడియా రోజురోజుకు పెరిగిపోతుంది. కొంతమంది ఆకతాయిలు సోషల్ మీడియాలో అడ్డూ, అదుపు లేకుండా విచ్చలవిడిగా రెచ్చిపోతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా కామెంట్లు చేస్తున్నారు. తాజాగా అలాంటి వారి ఏకంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర జవాన్ల కుటుంభాలను సైతం వదలడం లేదు. కొద్ది రోజుల క్రితం దేశం కోసం ప్రాణమిచ్చిన కెప్టెన్ అన్షు మాన్ సింగ్‌కు భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది,. అయితే ఆ అవార్డును ఆయన సతీమణి స్మృతికి రాష్ట్రపతి ముర్ము రెండు రోజుల క్రితం అందించింది. ఈ సందర్భంగా అమర జవాన్ అవార్డు తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోకు అహ్మద్ అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తూ..




ఆమె చాలా అందంగా ఉందంటూ.. అసభ్య పదజాలంతో కామెంట్ చేశాడు. దీంతో ఆగ్రహించిన నెటిజన్లు ఆ కామెంట్ ను మరోసారి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన జాతీయ మహిళా కమిషన్ అహ్మద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసింది. కాగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ భార్యపై ఇలాంటి అసభ్య ప్రవర్తన కనబరిచిన అతన్ని కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలైంది.

ముందడుగు
బుధవారం,
10-7-2024,
హైదరాబాద్



## ఎన్‌బీకే 109 మూవీ షూటింగ్‌లో గాయపడ్డ బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలా..!

బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలా ఓ తెలుగు చిత్రంలో నటిస్తున్నది. ప్రస్తుతం చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతున్నది. అయితే, షూటింగ్‌లో ఊర్వశి తీవ్రంగా గాయపడిందని.. దాంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు సమాచారం. నందమూరి బాలకృష్ణ నటిస్తున్న చిత్రం 'ఎన్‌బీకే 109'. ఈ చిత్రంలో కీలకపాత్రలో ఊర్వశి నటిస్తున్నది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ సైతం కనిపించనున్నారు. ఓ సన్నివేశం చిత్రీకరిస్తున్న సమయంలో ఊర్వశికి ఫ్రాక్చర్ అయ్యిందని.. అప్పటి నుంచి తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నట్లు ఆమె టీమ్ తెలిపింది. ఎన్‌బీకే 109 మూవీ మూడో షెడ్యూల్ కోసం ఊర్వశి ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిందని ఆమె బృందం పేర్కొంది. ప్రస్తుతం ఊర్వశి ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి సమాచారం తెలియాల్ని ఉన్నది. బాలకృష్ణ-బాబి కాంబోలో ఈ మూవీ తెరకెక్కుతున్నది. 'ఎన్‌బీకే 109' వర్కింగ్ టైటిల్. బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా వీడియో గ్లింప్స్ విడుదల చేయగా.. అభిమానుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ఈ మూవీలో ఊర్వశి రౌటెలాతో పాటు బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్, చాందిని చౌదరీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సితారా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. కాగా, మ్యూజిక్ సంచలనం ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ఊర్వశి ప్రస్తుతం బాలకృష్ణ మూవీతో పాటు సన్నీ డియోల్ 'బాప్'.. మిథున్ చక్రవర్తి, సంజయ్‌దత్, రణదీప్ హుడాతో 'ఇన్‌స్పెక్టర్ అవినాశ్-2' చిత్రాల్లో నటిస్తున్నది.

# తెలియకుండా ఏ మెడిసిన్ వాడొద్దు

- విచ్చలవిడిగా మందులు వాడితే శరీరం స్పందించదు
- మెడిసిన్ వాడకంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం



ముందడుగు ఢిల్లీ:

చాలా మంది తమ అనారోగ్య సమస్యలకు వైద్యుడి దగ్గరికి వెళ్లడం లేదు. తెలిసిన వారి సలహా తీసుకోవడమో లేదా నెట్‌లో వెతికి ఏదో ఒక యాంటీబయాటిక్ మెడిసిన్ వాడుతున్నారు. చిన్న అనారోగ్య సమస్యలకు డాక్టర్‌ను సంప్రదించడం ఎందుకనే ఆలోచన రోజురోజుకు పెరిగిపోయింది. ఇలా ఓ క్రమ పద్ధతి లేకుండా యాంటీబయాటిక్స్ వినియోగిస్తూ ఉంటే రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. విచ్చలవిడిగా ఇలాంటి మందులు వాడితే, చివరికి శరీరం ఏ ఔషధాలకు స్పందించక ప్రాణాలకే ప్రమాదం రావచ్చు. వీటి వినియోగం, విక్రయాలపై సరైన నియంత్రణ లేకపోతే రానున్న రోజుల్లో యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ రూపంలో పెనుముప్పు తప్పదని తరచూ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది.

### యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అంటే ఏంటి?

యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ లేదా ఏఎంఆర్ అంటే, బ్యాక్టీరియా, ఫంగస్, జెర్మ్స్ డ్రగ్-రెసిస్టెంట్‌గా మారడం. యాంటీబయాటిక్స్, ఇతర మెడిసిన్ శరీరంపై ఏ మాత్రం ప్రభావం చూపలేకపోవడం. దీంతో అంటువ్యాధులకు చికిత్స కష్టతరమవుతుంది, ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తుంది, ఖర్చులు కూడా పెరుగుతాయి. మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) పెరుగుతున్న కారణంగా, ఢిల్లీలోని ఫార్మసిస్ట్‌లు వ్యాలిడ్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఏఎంఆర్ మందులను అమ్మకూడదని అక్కడి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జనవరి 1న జారీ చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా స్టేట్ డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ ఈ చర్యలు తీసుకుంది. ఆల్ ఢిల్లీ కెమిస్ట్స్ అసోసియేషన్‌కు జారీ చేసిన ఈ గైడ్‌లైన్స్, డ్రగ్స్ రూల్స్‌లోని షెడ్యూల్ H & H1కి కట్టుబడి ఉండాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. ఈ షెడ్యూల్స్ కింద పేర్కొన్న యాంటీబయాటిక్స్, అర్హత కలిగిన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటే మాత్రమే అందజేయాలని నిర్దేశిస్తున్నాయి. యాంటీ మైక్రోబయాల్స్ విచక్షణారహిత వినియోగాన్ని అరికట్టడం ద్వారా పెరుగుతున్న ఏఎంఆర్ సమస్యలను పరిష్కరించవచ్చని ఢిల్లీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది.

### రికార్డులు తప్పనిసరి

మార్గదర్శకాల ప్రకారం, ఫార్మసిస్ట్‌లు మూడు సంవత్సరాల పాటు మూడు, నాలుగో జనరేషన్ యాంటీ మైక్రోబయాల్స్‌ను కలిగి ఉన్న షెడ్యూల్ H1 ఔషధాల విక్రయాల వివరణాత్మక రికార్డులను మెయింటైన్ చేయాలి. ఈ శక్తివంతమైన మందుల పంపిణీని పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ఈ రికార్డ్ కీపింగ్ నిబంధన చాలా కీలకం. రాష్ట్ర ఆరోగ్య శాఖకు చెందిన ఒక అధికారి ఈ విషయంపై మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి ఏఎంఆర్ ముప్పు తీవ్రతను పేర్కొన్నారు. ఏఎంఆర్ ద్వారా ఎదురయ్యే సవాళ్లను గుర్తిస్తూ, యాంటీబయాటిక్స్ విచక్షణారహిత వినియోగాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలోని నియంత్రణ సంస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉంటాయి. సాధారణ ప్రజల్లో ఏఎంఆర్ పెరుగుతున్న సంఘటనలపై ఢిల్లీ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తాజా గైడ్‌లైన్స్, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, బాధ్యతాయుతమైన యాంటీబయాటిక్ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వ నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి. వాస్తవానికి చాలా రకాల యాంటీమైక్రోబయాల్స్ షెడ్యూల్ H & H1 ప్రిస్క్రిప్షన్ డ్రగ్స్‌లో భాగంగా ఉన్నాయి. ఇప్పుడు వైద్యుల ప్రిస్క్రిప్షన్‌కు అనుగుణంగా మాత్రమే వీటిని మెడికల్ షాపుల్లో అమ్మనున్నారు.